ప్లాస్టిక్ నిషేధం అమలెక్కడ!

- గుట్టు చప్పుడు కాకుండా కవర్ల విక్రయాలు
- రోజు రోజుకూ పెరుగుతున్న వినియోగం
- ప్రజలు, వ్యాపారుల్లో చైతన్యం వస్తేనే అడ్డుకట్టకు అవకాశం

మిర్యాలగూడ టౌన్ : మున్సిపాలిటీలో ప్లాస్టిక్ వినియోగం రోజు రోజుకు పెరుగుతుంది. గత ప్రభుత్వాల హయాంలో 2013లో 40 మైక్రాన్‌లోపు పాలిథిన్ కవర్లు, ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించారు. ఇది కేవలం అమలులో చెప్పుకోవడానికి తప్ప ఆచరణలో మాత్రం అమలు సాధ్యం కాలేదు. నియంత్రించాల్సిన అధికారులు, వినియోగానికి దూరంగా ఉండాల్సిన ప్రజలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అయితే మున్సిపల్ అధికారులు మాత్రం నామ మాత్రపు జరిమానాలు విధిస్తూ మమ అనిపించడం మామూలైంది. మున్సిపాలిటీలో ప్రతి రోజు సుమారు 65 నుంచి 70 మెట్రిక్ టన్నుల వ్యర్థాలను సేకరిస్తే వాటిలో సుమారు 12 మెట్రిక్ టన్నుల వరకు ప్లాస్టిక్ వ్యర్థాలు ఉంటున్నాయంటే వినియోగం ఎంత మేరకు జరుగుతందో అర్థమవుతుంది.

అన్నింటికీ ప్లాస్టిక్ కవర్లే..

మున్సిపాలిటీలో నిత్యావసర సరుకులతో పాటు



అన్ని రకాల వస్తువులు తీసుకెళ్లేందుకు ప్లాస్టిక్ కవర్లనే వాడుతున్నారు. ఇళ్ల నుంచి సేకరించే చెత్తలో ఇంత మొత్తంలో ప్లాస్టిక్ కవర్లు పోగవుతున్నాయంటే పట్టణ కేంద్రంలో ఉండే హోటళ్లు, ఇతర ప్రాంతాల్లో ప్లాస్టిక్ వినియోగం గురించి ఊహించుకుంటే భయమేస్తోంది.

నామ మాత్రంగా అవగాహన

ప్లాస్టిక్ నివారణపై మున్సిపల్ ఉన్నతాధికారులు ఏమైనా ఆదేశాలు ఇస్తేనే తప్ప క్షేత్రస్థాయిలో అధికారులు చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అప్పుడప్పుడు ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా హడావుడి చేసి తరువాత వదిలేస్తున్నారు. కొన్ని చోట్లు కిరాణా దుకాణాల్లో నామామాత్రపు దాడులు నిర్వహించి జరిమానాలు విధిస్తూ మిన్నుండకుండా ఉంటున్నారు.

ఆలోచనలో మార్పులు వస్తేనే..

మున్సిపాలిటీలో ప్లాస్టిక్ వినియోగంపై ప్రజల్లో పెద్దగా చైతన్యం కనిపించడం లేదు. ఇంటి నుంచి మార్కెట్‌కు వెళ్లే సమయంలో సంచులు తీసుకెళ్లాలనే ఆలోచనలు రావడం లేదు. మున్సిపాలిటీలోని డ్రైయినేజీల్లో సుమారు 20శాతం మేరకు ప్లాస్టిక్ వ్యర్థాలు పెరుకుపోతున్నాయని అధికారులే నిర్ధారిస్తున్నారు. పారిశుద్ధ్య సిబ్బంది మురుగును తొలగించే క్రమంలో ప్లాస్టిక్ కవర్లు, ఇతరాత్ర వస్తువులు వస్తున్నాయని అధికారులు చెబుతున్నారు.

లైసెన్స్‌లు రద్దు చేస్తాం



ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు దుకాణాదారులు సహకరించకుంటే, వాటి వినియోగాన్ని అదే విధంగా కొనసాగిస్తే ట్రేడ్ లైసెన్స్‌లను రద్దు చేస్తాం. ప్లాస్టిక్ కవర్ల స్థానంలో ఇతర ప్రత్యామ్నయాలను వినియోగించేలా వ్యాపార సంస్థల నిర్వాహకులకు ఇప్పటికే అవగాహన కల్పించాం. మరో మారు ప్లాస్టిక్ వినియోగిస్తే భారీగా జరిమానాలను విధించడంతో పాటు వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– మహ్మద్ యూసుఫ్, మున్సిపల్ కమిషనర్, మిర్యాలగూడ

క్లుప్తంగా

నేటి నుంచి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ పట్టణం, మండలంలో ఈనెల 15వ తేదీ నుంచి నవంబరు 14వ తేదీ వరకు గాలి కుంటూ వ్యాధి నివారణ టీకాలు వేసేందుకు మూడు బృందాలు ఏర్పాటు చేసినట్లు మండల పశువైద్యాధికారి రమాదేవి అన్నారు. సోమవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మొదటి టీంకు డాక్టర్ శంకర్‌రావు, రెండో టీంకు డాక్టర్ జ్ఞానేశ్వర్‌రావు, మూడో టీంలో డాక్టర్ ఎన్‌డి రమాదేవి ఉంటారని తెలిపారు.

త్రిపురారం : మండల వ్యాప్తంగా గ్రామాల్లో ఈ నెల 15వ తేదీ నుంచి నవంబర్ 14వ తేదీ వరకు పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను రైతులు సకాలంలో వేయించుకోవాలని త్రిపురారం మండల పశువైద్యాధికారి డాక్టర్ నగేందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను రైతులు ముందస్తుగా పశువులకు వేయించి వ్యాధుల బారిన పడకుండా చూసుకోవచ్చాన్నారు. ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కేజీకేఎస్ వార్షికోత్సవ కరపత్రం ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

హాలియా : ఈనెల 18న హైదరాబాద్‌లో నిర్వహించనున్న కల్లుగీత కార్మిక సంఘం(కేజీకేఎస్) 67వ వార్షికోత్సవాలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సీతారాములు పిలుపునిచ్చారు. సోమవారం హాలియా పట్టణంలో కల్లుగీత కార్మిక నాయకులతో కలిసి ఆయన కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. కల్లుగీత కార్మిక వృత్తిలో ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని, సేఫ్టీ మోకులు రాజకీయాలకు అతీతంగా వృత్తి చేసే కార్మికులకు ఉచితంగా పంపిణీ చేయాలని, సభ్యులందరికీ ద్విచక్ర వాహనాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు వేములకొండ పుల్లయ్య, బొడ్డు లక్ష్మి, మండల అధ్యక్షుడు కాట్నం యాదగిరి గౌడ్, ప్రధాన కార్యదర్శి నర్సింగ్ సైదులు, సభ్యులు కాసాని సత్తయ్య, కాట్నం పరమేష్, యాదగిరి, వెంకన్న, శ్రీను తదితరులు ఉన్నారు.


టీచర్ ఉద్యోగం పొందిన వ్యక్తికి సన్మానం



హరీశ్‌ను సన్మానిస్తున్న ఎన్‌సీఎం ఫౌండేషన్ చైర్మన్, డీఈ ఆంజనేయులు

హాలియా : ఇటీవల వెలువడిన డీఎస్సీ ఫలితాల్లో ఉద్యోగం సాధించి నియామకపత్రం అందుకున్న హాలియా పట్టణంలోని మూడవ వార్డుకు చెందిన చెన్నం హరీశ్‌ను సోమవారం ఎన్‌సీఎం ఫౌండేషన్ ఆధ్వర్యంలో చైర్మన్, డీఈ నల్లగొండ ఆంజనేయులు ఘనంగా సన్మానించారు. కష్టపడితే కచ్చితంగా విజయాలు చేకూరుతాయన్నారు.ఈ కార్యక్రమంలో టీచర్ ఆకుల యాదగిరి, తల్లిదండ్రులు రమేష్, పద్మ, ఆకుల జయమ్మ, ఎన్‌సీఎం ఫౌండేషన్ సభ్యులు శివ, కోటేష్, అనిల్, సాయి, రాంబాబు, మధు, శ్రావన్, వంశీ, రాజేష్, బాస్కర్, వినోద్ తదితరులు ఉన్నారు.

వడ్డీ లేని రుణాలు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న గోవర్ధని

వేములపల్లి : హిళా సంఘాలకు ప్రభుత్వం వడ్డీ లేని రుణాలను అందించాలని ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి పాదూరి గోవర్ధని అన్నారు. సోమవారం మండలంలోని మొలకపట్నం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం మహిళలకు రూ.2500 భరోసా నిధులు విడుదల చేయాలని, డ్వాక్రా మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు అందించాలని, బస్సుల సంఖ్య పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ, ఈదమ్మ, సరిత, సువర్ణ, నాగమ్మ, సైదమ్మ, కలమ్మ, మాణిక్యమ్మ, కళావతి, లింగమ్మ తదితరులు పాల్గొన్నారు.

అనాథ ఆశ్రమంలో అన్నదానం

మిర్యాలగూడ టౌన్ : పట్టణానికి చెందిన ఇస్లావత్ గర్మానాయక్, దానియేలు జ్ఞాపకార్థంగా సోమవారం ఫెయిత్ బంజారా అనాథ ఆశ్రమంలో కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హన్యానాయక్, రమాబాయి పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే బాలునాయక్



ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

దేవరకొండ : కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి కృషి చేస్తుందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. సోమవారం దేవరకొండ మండలం కొండభీమనపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. వరంగల్ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ మేరకు దేశంలోని ఏ రాష్ట్రం చేయని విధంగా రైతులకు ఏక కాలంలో రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. ఇచ్చిన మాట ప్రకారం దసరా కానుకగా రైతులు పండించే వరి ధాన్యానికి రూ.500బోనస్ ఇస్తున్నట్లు తెలిపారు. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీరాములు, ఏడీఏ శ్రీలక్ష్మీ, ఎంపీడీఓ డానియల్, డీటీ హన్మంతు శ్రీనివాస్‌గౌడ్, ముక్కమళ్ల వెంకటయ్య గౌడ్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి మాజీ మంత్రి పరామర్శ



పెద్దవూర: చింతపల్లితండాలో జంకా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి

పెద్దవూర: మండలంలోని చింతపల్లి తండాకు చెందిన బీఆర్‌ఎస్ పెద్దవూర మండల అధ్యక్షుడు జటావత్ రవినాయక్ మాతృమూర్తి రమావత్ జంకా అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. సోమవారం మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంతకండ్ల జగదీష్‌రెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్, కంచర్ల భూపాల్ రెడ్డి, పైళ్ల శేఖర్‌రెడ్డి, ట్రికార్ మాజీ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్‌నాయక్, రేగట్టె మల్లిఖార్జున్‌రెడ్డిలు చింతపల్లితండాలోని ఆమె స్వగృహానికి వెళ్లి జంకా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు కంచర్ల కృష్ణారెడ్డి, ఒంటిద్దు నర్సింహారెడ్డి, గోనె వివేకరావు, కేవీ రామారావు, చెన్ను సుందర్‌రెడ్డి, లింగయ్య, రావుల శ్రీను, లక్ష్మణ్, శ్రీకర్, రాంబాబు, మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.

దశరథమ్మ మృతి బాధాకరం



నివాళులర్పిస్తున్న గుత్తా సుఖేందర్ రెడ్డి

చింతపల్లి : మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన దశరథమ్మ మృతి బాధాకరమని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మాజీమంత్రి జగదీశ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్, గాదరి కిశోర్, పైళ్ల శేఖర్‌రెడ్డిలు అన్నారు. సోమవారం దశరథమ్మ దశదినకర్మలు వారు పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆమె ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. ఆమె మృతిపై ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు కంకణాల వెంకటరెడ్డి, కేతావత్ బిల్యా నాయక్, దొంతం చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి



పూలే విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న బీసీ సంఘం నాయకులు

మిర్యాలగూడ టౌన్ : మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం వరంగల్ జిల్లా దేశాయిపేట వద్ద సామాజిక వేత్త మహాత్మాజ్యోతిరావు పూలే విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఆ సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం సాగర్ రోడ్డులోని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి పాలాభిషేకం చేశారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని అధికారులు, ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షులు బంటు వెంకటేశ్వర్లు, ఏఐఎంఐఎం జిల్లా కార్యదర్శి ఎండీ ఫారూఖ్, దేవతల సైదులు, నామ రవీందర్ తదితరులున్నారు.

రూ.500 బోనస్ సద్వినియోగం చేసుకోవాలి

త్రిపురారం : ప్రభుత్వం సన్నరకం వరి ధాన్యానికి అందించే రూ. 500 బోనస్‌ను మండలంలోని రైతులు సద్వినిఝోగం చేసుకోవాలని త్రిపురారం ఎంపీడీఓ విజయ కుమారి అన్నారు. సోమవారం మండలంలోని మాటూర్‌లో మద్దతు ధర, రూ. 500 బోనస్‌పై రైతులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ విజమకుమారి మాట్లాడుతూ కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో విక్రయించుకొని మద్దతు ధర పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎమ్ అశోక్ కుమార్, ఐకేపీ సీసీలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

మిర్యాలగూడ : దామరచర్ల మండల కేంద్రంలోని శ్రీ విద్యానికేతన్ ఉన్నత పాఠశాలలో 2012 -13 బ్యాచ్‌కు చెందిన పదోతరగతి పూర్తిచేసుకున్న విద్యార్థులు సోమవారం స్థానిక ఒక ఫంక్షన్‌హాల్లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకొని ఆహ్లాదంగా గడిపారు. పాఠశాలలో తాము గడిపిన గత స్మృతులను నెమరువేసుకున్నారు. అనంతరం తమకు పాఠాలు బోధించిన గురువులను శాలువాలు, మెమొంటోలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు డి.ఇంద్రసేనారెడ్డి, రామకృష్ణారెడ్డి, చంద్రశేఖర్, సత్యనారాయణ, శ్రీను, చంద్రకళ, పూర్వ విద్యార్థులు రఫి, నవీన్, శ్రీకాంత్, కోటేశ్వర్‌రావు, మహేష్, భవాని, సుచరిత, సాహితి, లావణ్య పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం



విజేత జట్టుకు బహుమతులు అందజేస్తున్న సీఐ

హాలియా : దసరా పండుగ సందర్భంగా మండలంలోని పేరూర్ గ్రామంలో నిర్వహించిన అండర్-14 క్రికెట్ పోటీలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా క్రీడల్లో గెలుపొందిన విజేతలకు వికారాబాద్ సీఐ ఆర్కపల్లి ఆంజనేయులు బహుమతులను అందజేసి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా పోటీలు నిర్వహించడం వల్ల యువకుల్లో స్నేహ సంబంధాలు ఎంతో దోహదప డతాయన్నారు. క్రీడా పోటీల్లో గెలుపు ఓటములు సహజమని క్రీడా స్ఫూర్తితో స్వీకరించాలని కోరారు. ఈ పోటీల్లో గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ శోభన్‌బాబు, నాయకులు రాంబాబు, రామ లింగయ్య, పురుషోత్తం, పర్వతాలు, శ్రీకాంత్, నాగరాజు, శంకర్, రాజు, షేక్ మగ్బూర్, నాగ సైదులు పాల్గొన్నారు.

'ఫీజు' బకాయిలు విడుదల చేయాలని ఆందోళన



మిర్యాలగూడ టౌన్ : నిరసన వ్యక్తం చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు



మిర్యాలగూడ అర్బన్ : మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు



దేవరకొండ : మాట్లాడుతున్న సాభాన్

మిర్యాలగూడ టౌన్ : డిగ్రీ, పీజీ కళాశాలలకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను తక్షణమే ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మిర్యాలగూడలో కళాశాలల బంద్ పాటించిన నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు మెంటు వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్లగా ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించకపోవడంతో కళాశాలలు నడిచే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. ఈ సమస్య పరిష్కారమయ్యేంత వరకు నిరవధిక సమ్మె కొనసాగిస్తామని హెచ్చరించారు. నిరసన వ్యక్తం చేసిన వారిలో విజేత, హసిత, చైతన్య, శాంతినికేతన్ డిగ్రీ కళాశాలలో యాజమాన్యాలు తేడ్ల ధనుంజయ, వర ప్రసాద్, కోల శ్రీను, శ్రీనాథ్‌లతో పాటు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి : రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్‌ఎఫ్ దేవరకొండ డివిజన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ శంశొద్దీన్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫీజు బకాయిలు రాకపోవడంతో ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలు కూడా తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. సర్టిఫికెట్ల కోసం విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తుండటంతో తల్లిదండ్రులు ఫీజులు కట్టలేక నానా తంటాలు పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలు నేటినుంచి బందు చేస్తున్నామని ప్రైవేట్ కళాశాలల యాజమాన్యం సంఘం అధ్యక్షుడు మారం నాగేందర్‌రెడ్డి తెలిపారన్నారు. కళాశాలల బిల్డింగ్ రెంట్లు, కరెంట్ బిల్లులు, సిబ్బంది వేతనాలు చెల్లించలేని దుస్థితిలో ఉన్నామన్నారు. ప్రభుత్వం కళాశాల యజమాన్యాలతో చర్చలు జరిపాలని కోరారు. బంద్ నిర్వహిస్తే క్లాసుల నిర్వహణ ఆలస్యమవుతుందని, దీని ప్రభావం సెమిస్టర్ పరీక్షల పైన పడే అవకాశం ఉందన్నారు.

కళాశాలల యాజమాన్యాలతో చర్చలు జరపాలి

మిర్యాలగూడ అర్బన్ : పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్, ఫీజు రియింబర్స్‌మెంట్ విడుదల చేసి ప్రైవేట్ ఇంటర్, డగ్రీ కళాశాలల యాజమాన్యాలతో చర్చలు జరిపి సమ్మె విరమింపజేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కుర్ర సైదానాయక్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..రాష్ట్రం ఏర్పాటు ఉద్యమంలో కీలకభూమిక పోషించిన పేద, మధ్యతరగతి విద్యార్థులకు గత ప్రభుత్వం స్కాలర్‌షిప్ ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమడిందని విమర్శించారు. ఆయన వెంట నాయకులు న్యూమాన్, ప్రసన్న, వీరన్న, సంపత్, మణి పాల్గొన్నారు.

దేవరకొండ : పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఉపకార వేతనాలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని యూఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సాభాన్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానికంగా నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఉపకార వేతనాలు విడుదల చేయకపోవడం వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న దాదాపు రూ.8వేల కోట్లు వెంటనే మంజూరు చేస్తూ ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో యూఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, తదితరులున్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

దేవరకొండ : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు కంబాలపల్లి వెంకటయ్య కోరారు. సోమవారం ప్రజాసంఘాల జేఏసీ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 1956 అక్టోబర్ 14న బౌద్ధ మతాన్ని స్వీకరించిన రోజును పురస్కరించుకొని పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రొఫెసర్ సాయిబాబాకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సహదేవుడు, భాస్కరాచారి, నరసింహాచారి, సైదులు, వెంకటాచారి, యేసయ్య, లక్ష్మణ్, మోష ఉన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు అవ్వండి



రక్తదానం చేస్తున్న యువకులు

మిర్యాలగూడ : కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుకూరి బాలకృష్ణ జన్మదినం సందర్భంగా శ్రీ అయుష్మాన్ భవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని బంగారుగడ్డలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా బాలు మాట్లాడుతూ ఆపదలో ఉన్న పేదలకు సాయం చేయడానికి యువకులు ముందుండాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శేఖర్‌రెడ్డి, ఎండీ.మొయిజ్, ఫయాజ్, షఫీ, మునీర్, రహీం పాల్గొన్నారు.

ఘనంగా దుర్గామాత శోభాయాత్ర



కొండమల్లేపల్లి : దుర్గామాత శోభాయాత్రను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

కొండమల్లేపల్లి : దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో పూజలందుకున్న దుర్గామాత శోభాయాత్ర సోమవారం కొండమల్లేపల్లి మండల కేంద్రంలో కన్నుల పండువగా సాగింది. మండల కేంద్రంలోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో ప్రతిష్ఠించిన దుర్గామాత విగ్రహం వద్ద దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం శోభాయాత్రను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యేను కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఉట్కూరి వేమన్‌రెడ్డి, దేవరకొండ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా, కుంభం శ్రీనివాస్‌గౌడ్, ఎంఏ. సిరాజ్ఖాన్, పస్నూరి యుగంధర్‌రెడ్డి, మాద్గుల యాదగిరి పాల్గొన్నారు.



డిండి: శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

డిండి : మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన దుర్గామాత శోభాయాత్ర సోమవారం అంగరంగవైభవంగా కొనసాగింది. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిననంతరం స్థానిక డిండి ప్రాజెక్టులో నిమజ్జనం చేశారు.

కుల గణన నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

హుజూర్‌నగర్ : రాష్ట్రంలో కులగణన చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించడాన్ని స్వాగతిస్తున్నామని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధూళిపాళ ధనుంజయనాయుడు అన్నారు. సోమవారం హుజూర్‌నగర్‌లోని అనుమాల లింగయ్య భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కులగణన చేపట్టేందుకు ప్రభుత్వం జీఓ నంబర్ 18 జారీ చేయడం బీసీల విజయమని భావిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, నరసయ్య, పాల్గొన్నారు.

రూ.30వేల వరకు జరిమానా విధిస్తాం



షాపులను తనిఖీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ ఎండీ యూసుఫ్

మిర్యాలగూడ టౌన్ : మున్సిపాలిటీలో ప్లాస్టిక్ నియంత్రణకు ప్రతి ఒక్క వ్యాపారి సహకరించాలని, లేకుంటే రూ.5వేల నుంచి రూ.30వేల వరకు జరిమానా విధించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ హెచ్చరించారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నియంత్రణపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అనంతరం ఆరు, ఏడు షాపుల్లో ప్లాస్టిక్ అమ్ముతున్న వారికి జరిమానాతో పాటు 21 కిలోల ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ప్లాస్టిక్ దొరికితే వారిపై చట్టపరమైన చర్యలతో పాటు దుకాణాలు సీజ్‌తో పాటు వారి లైసెన్స్‌లను కూడా రద్దు చేయనున్నట్లు తెలిపారు. ఈ విషయంలో ఎవరిని కూడా ఉపేక్షించేది లేదన్నారు. చిన్న షాపుల వారికి రూ.5వేలు, పెద్ద షాపుల వారికి రూ.30 వేల లోపు జరిమానా విధించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, జవాన్లు తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో బీసీ కాలనీ



వీధి దీపాలు వెలగకపోవడంతో చీకటిగా ఉన్న బీసీ కాలనీ

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలోని దేవరకొండ రోడ్డులోని బీసీ కాలనీకి వెళ్లే రోడ్డు మార్గంలో వారం రోజుల నుండి వీధి దీపాలు వెలగకపోవడంతో అంధకారంలో గడపాల్సి వస్తుందని కాలనీవాసులు వాపోతున్నారు. పండుగ సమయంలోనైన కనీస మరమ్మతులు చేపట్టకపోవడంతో అధికారుల తీరుపై కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామ సమస్యలు పరిష్కారం కావడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టిన వీధి దీపాలను ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.